క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలసిన పాస్టర్లు



ఎమ్మెల్యే వైవీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాస్టర్లు

గుత్తి: గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామి రెడ్డిని సోమవారం గుత్తి పాస్టర్లు కలిశారు. వైఎస్సార్‌సీపీ క్రిష్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు ఆధ్వర్యంలో పాస్టర్లు వాసు అనిల్‌కాంత్, జాకబ్, అబ్రహాం, సాల్మన్, అహరోన్, క్రాంతి, రాజు, ఆనంద్, ఆంటోని, సురేష్, రాజేష్ తదితరులు ఎమ్మెల్యేను కలిశారు. వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని పాస్టర్లు ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో క్రిష్టియన్ మైనార్టీ కమిటీలు వేసి ప్రచారం నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



ప్రచారం చేస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

పెద్దపప్పూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసకుందామని వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి సాయి ప్రతాప్ రెడ్డి కోరారు. మండలంలోని సోమనపల్లిలో సోమవారం సాయంత్రం ఆయన పర్యటించారు. సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆయన కోరారు. ఎంపీపీ వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, జిల్లా పార్లమెంట్ జనరల్ సెకరట్రీ రవిప్రసాద్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అమర్‌నాథ రెడ్డి, ఎంపీటీసీలు నారాయణ, అనిల్‌కుమార్‌రెడ్డి, నామనాంకపల్లి రఘునాథరెడ్డి, స్థానిక నాయకుడు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న దేవదాయశాఖ అధికారులు

పెద్దపప్పూరు: అశ్వత్థంలో మాఘమాసం తొలి ఆదివారం తిరుణాల సందర్భంగా భక్తులు హుండీల్లో వేసిన కానుకలను సోమవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం నేతృత్వంలో లెక్కించారు. తాత్కాలిక హుండీల నుంచి రూ.7,95,600, పర్మినెంటు హుండీల ద్వారా 2,39,939 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తొండపాడులో..



హుండీ కానుకలను లెక్కిస్తున్న అధికారులు

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలో బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లోని కానుకలను లెక్కించగా రూ.3.63.905 ఆదాయం వచ్చినట్లు ఈఓ దేవదాసు తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో ఉత్సవ ప్రత్యేక అధికారి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్ పాల్గొన్నారు. ఎస్‌ఐ నబీరసూల్ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా కల్యాణోత్సవం



శివపార్వతుల కల్యాణోత్సవ దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో మాఘ మాసం మూడో సోమవారం ఆలయ కమిటీ, శివమాలధారులు, భక్తుల ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట నడుమ అభిజిత్ లగ్నంలో శివపార్వతుల పెళ్లి తంతును ప్రధాన అర్చకుడు రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. వేదపండితులు చంద్ర, అనిల్ మంత్రోచ్ఛరణల నడుమ శివమాలధారుల శివనామస్మరణ, మంగళవాయిద్యాల మధ్య కల్యాణ కర్తలు ప్రదీప్, రాహుల్ దంపతుల సంయుక్త సారథ్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

విద్యార్థి అదృశ్యం



అసిఫ్‌బాషా

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన హాజీబాషా కుమారుడు అసిఫ్ రాజా మదనపల్లెలో బీటెక్ చదువుతున్నాడు. కొన్ని సబ్జెక్టులు తప్పడంతో కుమారుడిని తండ్రి మందలించాడు. దీంతో ఈ నెల 15న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం తెలియకపోవడంతో.. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

అభివృద్ధి అంటే ఇది కాదా?

- ప్రతిపక్షాలను ప్రశ్నించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- గ్రామాల్లో ఆర్‌బీకేలు, సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభం



లక్షుంపల్లె ఆర్‌బీకే ఎదుట నాయకులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదని మాట్లాడుతున్న పచ్చ పార్టీ నేతలకు, వారి మాటలను నమ్మించడానికి విష ప్రచారం చేస్తున్న పచ్చ పత్రికలకు కళ్లు కనిపించటం లేదా..? అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రశ్నించారు. ప్రతి గ్రామంలో కోట్ల రూపాయలు వెచ్చించి సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టించారని, వీటితో గ్రామాలు అభివృద్ధి చెందలేదా అని ప్రశ్నించారు. మండలంలోని నిట్టూరులో ఆర్‌బీకే, లక్షుంపల్లెలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, చందనలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభోత్సవం, దైవాలమడుగు నుంచి రాయలచెరువు వరకూ డబుల్ రోడ్డు పనులకు భూమి పూజ కార్యక్రమంలో సోమవారం ఉదయం ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు అనారోగ్యం పాలైతే మండలంలో ఉండే ఆస్పత్రికి పోవాల్సిన అవసరం లేకుండా సీఎం జగన్ గ్రామంలోనే వెల్‌నెస్ సెంటర్లు నిర్మించారన్నారు. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం మండలాల్లో వేచి ఉండకుండా, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి ఆర్‌బీకేలను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయాలు ఏర్పాటు చేసి అన్ని సేవలను గ్రామాల్లోనే అందించడం అభివృద్ధి కాదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా రోజుల తరబడి మండల కేంద్రాలకు తిరగాల్సిన పరిస్థితి నుంచి ప్రస్తుత ప్రభుత్వం అన్ని రకాల సేవలను ఇంటి ముంగిటకే తీసుకొచ్చింది నిజం కాదా? అని ప్రతిపక్షాలకు ఎమ్మెల్యే ప్రశ్నల వర్షం కురిపించారు. అనంతపురం జిల్లాకు సరిహద్దున ఉన్న మండలంలోని దైవాల మడుగు నుంచి రాయలచెరువు వద్ద ఉన్న 67వ జాతీయ రహదారి వరకూ ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.9.50 కోట్లతో నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులను చందన గ్రామం వద్ద ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే దైవాలమడుగు, చందన రాయలచెరువు గ్రామాల ప్రజలతో పాటు నంద్యాల జిల్లా డోన్ మండలం ప్యాపిలి మండల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

రెండు రోజుల క్రితం మండలంలోని చందన గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజశేఖర్ కుమారుడు యగ్నేష్ ట్రాక్టర్ డోర్ తగిలి మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లి రాజశేఖర్‌ను పరామర్శించి రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. లక్షుంపల్లె గ్రామ సమీపంలో గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లకు 20 సెంట్ల స్థలాన్ని తండ్రి కడితం రామచంద్రారెడ్డి పేరిట ఉచితంగా ఇచ్చిన దాత కడితం భాస్కర్ రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సావిత్రి, పీఆర్ ఏఈ ఆదినారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, లక్షుంపల్లె, నిట్టూరు సర్పంచులు పద్మనాభరెడ్డి, నాగలక్షుమ్మ, ఎంపీటీసీలు లక్ష్మీదేవి, రాగుల పార్వతి, వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, రామాంజులరెడ్డి, జయకృష్ణ, బలరాముడు, కడితం భాస్కర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ వెంకటరామిరెడ్డి, జయరామిరెడ్డి సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



దైవాలమడుగు, రాయలచెరువు డబుల్ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

వైఎస్సార్ బీమా చెక్కుల పంపిణీ



మహిళలకు రూ.5 లక్షల విలువ చేసే చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి రూరల్: మండలంలోని మాముడూరు గ్రామానికి చెందిన కండ్లపల్లి నాగార్జున, కండ్లపల్లి చిన్న తిప్పయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలను వైఎస్సార్ బీమా చెక్కులను సోమవారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అందజేశారు. గార్లదిన్నె మండలం కల్లూరు శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై 2023 డిసెంబర్ 23న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వోల్వో బస్సు ఢీకొట్టడంతో మాముడూరు గ్రామానికి చెందిన మామిళ్లపల్లి శ్రీనివాసులు, పసులోరు శ్రీరాములు, కండ్లపల్లి చిన్న తిప్పయ్య, కండ్లపల్లి నాగార్జున మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే మృతుల కుటుంబాలకు పామిడి ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించిన ఎమ్మెల్యే వైవీఆర్ ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం త్వరగా వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని ముఖ్యమంత్రి కార్యాలయంలో మాట్లాడి బాధితులకు త్వరగా ఆర్థిక సాయం వచ్చేలా చూశారు. అయితే నాగార్జున, చిన్న తిప్పయ్య 'వైఎస్సార్ బీమా'లో నమోదు కానందున వారికి ఆర్థిక సాయం అందలేదు. దీంతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మృతుల కుటుంబాలకు బీమా మంజూరు చేయించారు. ఈ క్రమంలో సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మృతుడు కండ్లపల్లి నాగార్జున భార్య జయమ్మకు రూ.5 లక్షల చెక్కు, కండ్లపల్లి చిన్న తిప్పయ్య భార్య లక్ష్మీదేవికి రూ.5 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా వారు సీఎం జగన్‌తోపాటు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే వైవీఆర్ ఔదార్యం

పామిడి: గుంతకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం రాత్రి ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి మండలంలోని పీ కొత్తపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ మునింద్ర పెళ్లికి సాయం చేశారు. వధువుకు తాళిబొట్టు, మెట్టెలు అందజేశారు. పెళ్లికి ఆర్థికసాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అనుంపల్లి సూరి, సురేంద్ర, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికానుక అందజేత

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 6వ వార్డుకు చెందిన అనురాధ కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే వైవీఆర్ ట్రస్ట్ ద్వారా పెళ్లికానుకను అందజేశారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో వధువు కుటుంబ సభ్యులకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి పెళ్లికానుక కింద బంగారు తాళిబొట్టు, కాలిమెట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లెలో షిర్డీ సాయినాథుని ఆలయ 21వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, రమాదేవి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నారాయణస్వామికి ఎమ్మెల్యే పూజలు

పెద్దపప్పూరు: మాఘమాసం మూడో సోమవారం సందర్భంగా తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అశ్వత్థం క్షేత్రంలోని నారాయణ స్వామి, చక్ర భీమ లింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. క్షేత్ర అభివృద్ధికి తనవంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి,ఈఓ సుబ్రమణ్యంకు ఆయన వివరించారు. ఆయనతో పాటు పలువురు మండలనాయకులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆర్థికసాయం అందజేత

పామిడి: మండలంలోని గజరాంపల్లి సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నీలూరువాసి బోయ సురేష్‌ను సోమవారం వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ కిసాన్ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి బెల్లాల రమణారెడ్డి, తంబళ్లపల్లి వెంకట్రామిరెడ్డి బాధితుడికి రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు.నాయకులు హరినాథ్‌రెడ్డి, కేశవరెడ్డి, నారాయణ స్వామి, నాగార్జున, సురేంద్ర పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గుంతకల్లు: పట్టణంలోని శిశుమందిర్, అనురాగ వృద్ధాశ్రమంలో కెనరాబ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సోమవారం రూ.50వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు ఎంప్లాయిస్ కే మధుసూదన్, ఎడీషన్, గోవింద్‌నాయక్, శైలజ, దిల్‌షాద్, మహదేవ్, అనూష తదితరులు పాల్గొన్నారు.

మోటర్, స్టార్టర్ల చోరీ

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీలో స్టేట్ బ్యాంకు ఉద్యోగి ఠాగూర్ కొత్త ఇంటిని నిర్మించుకుంటున్నాడు. అక్కడ ఉన్న విద్యుత్ మోటర్, స్టార్టర్లు, పైప్‌లు, కేబుల్ ఆదివారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

బుక్కరాయసముద్రం: ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని మండల వైద్యులు స్వాతి లక్ష్మి, తెహరున్నీసా అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్‌గా పనిచేస్తున్న భవానికి కర్నూలు జిల్లాలో స్టాఫ్ నర్స్‌గా ఉద్యోగం వచ్చినందుకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్‌రావు, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, ఫార్మసిస్ట్ బాషా, టెక్నీషియన్ శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్లు, మిడ్ లెవల్ ప్రొవైడర్స్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యాలు ఎంతో అవసరమని ఏపీఎస్‌ఎస్‌డీసీ సీనియర్ టెక్నికల్ ట్రైనర్ నర్మద సూచించారు. సోమవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, ఏపీఎస్‌ఎస్‌డీసీ సహకారంతో బీటెక్ విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రామింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక టెక్నాలజీపై నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ సాయి చైతన్య కిషోర్ డాక్టర్ వంశీ క్రిష్టారెడ్డి, డాక్టర్ చిత్ర లింగప్ప, స్పోక్ ఫ్యాకల్టీ కోఆర్డినటర్ డాక్టర్ సొదాగిర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు వాహనాల వేలం

యాడికి: సెబ్ కేసుల్లో పట్టుబడిన తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవడుగూరు: కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ పెద్దవడుగూరు శాఖ మేనేజర్ ప్రనీత్ సూచించారు. సోమవారం మండలంలోని దిమ్మగుడి, చిత్రచేడు, భీమునిపల్లి తదితర గ్రామాల్లో నాబార్డ్ సౌజన్యంతో కళాజాతా బృందం సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది చిదంబరేష్, ప్రేమ్‌కుమార్, చిన్న పాల్గొన్నారు.

డిజిటల్ సర్వీసులపై అవగాహన

బుక్కరాయసముద్రం: విద్యార్థులు చదువుతో పాటు ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ సర్వీసులపై అవగాహన పెంపొందించుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగవేణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీకి చెందిన విద్యార్థులు ఒకేషనల్ ఎక్విికేషనల్‌లో భాగంగా గాంధీనగర్‌లో ఉన్న సచివాలయం–4ను సందర్శించారు. సచివాలయంలో పేదలకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఒకేషనల్ ట్రైనర్ దివ్యవాని, నాగేంద్రమ్మ, రమాదేవి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఘనంగా రామకోటి తిరునాల

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని రామకోటి కాలనీలో సోమవారం రామకోటి తిరునాల ఘనంగా నిర్వహించారు. మాఘమాసం మూడో ఆదివారం మరుసటి రోజు తిరునాల నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మెడికల్ స్టోర్‌లో చోరీ

యాడికి: తాళాలు పగులగొట్టి మెడికల్ స్టోర్ దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చొరబడి నగదు దోచుకెళ్లారు. సోమవారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న యజమాని రవి షాపు వద్దకు వెళ్లాడు. షాపులోని రూ.40 వేలు కనబడక పోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యాచకులకు విందు

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీవాసులు సోమవారం అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రానికి భిక్షాటన కోసం విచ్చేసిన యాచకులను సాదరంగా ఆహ్వానించి విందు ఏర్పాటుచేశారు. వంశపారపర్యంగా వస్తున్న ఆచారంలో భాగంగా ఏటా యాచకులకు మాంసాహార విందు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందని నిర్వహకులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టపాడుకు చెందిన ఓబుళరెడ్డి, శ్రీరాములు, పామిడి మండలం ఎదురూరు గ్రామానికి చెందిన గణేష్‌ను 108 ద్వారా క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అక్కదేవతల విగ్రహ ప్రతిష్ఠ

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వర్థనారాయణ స్వామి క్షేత్ర సమీపంలో పెన్నానది ఒడ్డున నూతనంగా నిర్మించిన అక్కదేవతల ఆలయంలో సోమవారం అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు నిర్వహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

'పల్స్ పోలియో' విజయవంతం చేయండి

గుత్తి: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వాస్పత్రి మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఢిల్లీశ్వరి సూచించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం పల్స్ పోలియో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మార్చి 3న ఐదేళ్లలోపు పిల్లలకు బూత్‌లలో పోలియో చుక్కలు వేయాలన్నారు. 4, 5వ తేదీల్లో ఇంటికి వెళ్లి పల్స్ పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎల్లారాముడు, ప్రవీన్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గార్లదిన్నె: పోలియో మహమ్మారిని తరిమేద్దామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు గౌతమి, మంజుల సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పల్స్‌పోలియో కార్యక్రమంపై వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మార్చి 3న ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్లు దిలీప్, పద్మావతి, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, పీహెచ్‌ఎన్ అరుణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, అంగన్ వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జితో ప్రయాణాలు సులభతరం

యాడికి: అండర్ బ్రిడ్జి వల్ల రాకపోకలు సులభంగా ఉంటాయని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ లక్ష్మీకాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాంబశివుడు అన్నారు. సోమవారం అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా మండలంలోని వేములపాడు గ్రామం వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని ప్రధామంత్రి నరేంద్ర మోదీ పర్చువల్ విధానంలో జాతికి అంకితం చేసే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైల్వే గేటు అర గంటకు ఒకసారి వేస్తుండటంతో అవతలి వైపున ఉన్న పొలాలకు వెళ్లాలన్నా, నగరూరు, పెద్దపప్పూరు మండలానికి పోవాలన్నా ఇబ్బందులు పడేవాళ్లమన్నారు. అనంతరం క్విజ్, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు వెంకటయ్య, దేవరాజు, కిరణ్, హరికృష్ణ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్ రెడ్డి, ప్రసాద్, రసూల్, అమర్‌నాథరెడ్డి, రమానందరెడ్డి, కుళ్లాయిస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థల సమస్య మరోమారు వివాదం

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో శ్మశాన వాటిక స్థల సమస్య సోమవారం మరోమారు వివాదంగా మారింది. గ్రామానికి చెందిన ఆదెప్ప అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడంతో.. పూడ్చడానికి శ్మశానానికి తీసుకెళ్లిన సమయంలో కొందరు అడ్డు చెప్పారు. మా స్థలంలో పూడ్చడానికి అనుమతించేది లేదని చెప్పడంతో బంధువులు మృతదేహంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అనంతపురం కలెక్టరేట్‌కు బయలుదేరారు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ హేమాద్రి వారిని నార్పల వద్ద అడ్డుకుని గ్రామానికి తీసుకెళ్లారు. అనంతరం ఇరువర్గాలతో చర్చించారు. గతంలో ఇదే సమస్యను పలుమార్లు రెవెన్యూ అధికారులు పరిశీలించి పరిష్కారం సూచించినా వివాదం కొనసాగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆర్డీఓ జి.వెంకటేష్ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేసి, మృతదేహానికి అంత్యక్రియలు జరిగేలా చర్యలు తీసుకున్నారు.